అసంపూర్ణ చిత్రం

శ్రీ ఆర్. ఎస్. కె. మూర్తి

డాక్టరు శశికళగారా! ఎంత అందంగా గీశా రా చిత్రాన్ని.—మెచ్చుకుంటున్నారు ప్రేక్షకులు.

డాక్టరు శశి గీసిందా ఈ చిత్రాన్ని! సింప్లీ మార్వలెస్!— ఆనందపడుతున్నారు తోడి డాక్టర్లు.

అవునే విమ్మీ, మన శశి చూశావా, ఈ చిత్రంలో ఎంతటి అందాన్ని వెలయించిందో !—కమల మురిసిపోతున్నది.

చూశావుటే కమలా, తెలు పసలు రంగే కాదంటారుకదా ? మన శశి చూడు తెల్లనిరంగుని ఎంత భావస్ఫోరకంగా వాడుకున్నదో!—విమల గర్వం.

కాని ఈ కాంప్లిమెంట్లన్నీ వింటున్న శశికి నోట్లో చెక్కపేడువేసుకొని, నములుతున్నట్లు అదేదో వికారంగా ఉంది.

శశి అంటే నేనేకదా !

నా చిత్రానికి ప్రథమ బహుమతి లభించింది, చిత్రకళా ప్రదర్శనంలో. ప్రేక్షకులు, పరిచయస్తులు, స్నేహితులు కాంప్లిమెంట్లు కురిపించటంలో తప్పేమీ లేదుకదా ? కాని అవి వింటుంటే ఏమిటోగా ఉంది, నాకు. ముఖ్యంగా విమలచేసిన రిమార్కు నన్నెందుకో బాగా కలవర పరిచింది.

తెలుపురంగుని భావస్ఫోరకంగా వాడానా, నేను? తెలుపు శూన్యత్వముయొక్క రంగు; నా మనసులోని శూన్యత్వాని కది చిహ్నం.

నా భావనలోవున్న శూన్యత్వాన్ని ఆ రంగుతో ప్రదర్శించా ననుకుంటున్నాను, నేను.

దాన్ని భావ స్ఫోరకంగా వాడానంటుందేమిటీ విమల ?

*   *   *   *

చిత్రం గీయాలని కాన్వాసుముందు నించున్నది, శశి. ఆ కాన్వాసెంత శూన్యంగా ఉందో మనసంత శూన్యంగాఉంది, శశికి. మదిలో ఏమీ భావన మెదలలేదు. గాలితెరవీచని పాతాళగహ్వరంలా మనస్సు; నీళ్ళు ఎండిపోయిన మహా సముద్రంలా భావనాజగత్తు. సకల జగత్తు నిశ్శబ్దనీరవజగత్తులా భాసించింది, శశికి.

ఏమీ తోచక, ఊరికే కాన్వాసుముందు నించో లేక, కుంచెను తెల్లరంగులోముంచి గీతలు గీయ సాగింది, శశి.

కాసేపటికా గీతలు మేఘాలుగా భాసించినై, ఆమెకు. దాంతో పైనున్న మేఘాలను పారిపోతున్న మేఘాలుగా, క్రిందనున్నవాటిని ఎగిరి, నురగలు కక్కుతున్న అలలుగా తీర్చిదిద్దింది, శశి.

క్రింద పరచుకున్న మహా సముద్రం—భయోత్పాతమైన నీటి ఎడారి.

పైన విచ్చుకున్న ఆకాశం—పాలిపోయిన గాలి ఎడారి. ఒకదానికి ఒడ్డులేదు; రెండవదానికి అంచు లేదు.

ఒకటి అర్థంకాని తన భవిష్యత్తు. రెండవది జీవంలేని తన వర్తమానం.

రెండూ రెండు మహా శూన్యాలు.

ఆ శూన్యాలమధ్య తాను వేళ్ళాడుతున్నట్లనిపించింది, శశికి.

అందుకే ఆ రెండు శూన్యాలకీమధ్య ఎగురుతున్న ఒక పక్షిని చిత్రించింది, శశి.

పక్షి ఎగురుతున్నది. ఎంతో ఎత్తున ఎగురుతున్నది. అది క్రిందిలోకాన్ని అలవోకగా చూస్తున్నదా? ఆవేదనతో వెతుకుతున్నదా? ఏమని చిత్రించాలి ?

దాని రెక్కలలో బలమున్నదిగదా? బలముడిగే

వరకు అది ఎగురుతూనే ఉంటుంది. కాని రెక్కలలో బల ముడిగిన నాడు ?

క్రిందికిదిగి, సేద తీర్చుకోవా లనుకున్ననాడు ఏమున్నది క్రింద ?

గూడు చూసుకొని, గువ్వలను చూసుకొని మురిసిపోవాలనుకుంటే, ఏదీ పట్టుగొమ్మ ?

పక్షి నిరాశావహి. అది ఆవేదనతోనే వెదుకు తున్నది. దాని కన్నులలో వున్నది దీనత్వమే.

ఆ దీనత్వాన్ని, దాని వేదనను ప్రదర్శించా లని ఆకాంక్షించింది, శశి.

అలా ప్రదర్శించా ననేదే ఆమెకు లభించిన తృప్తి.

'అబ్బ, ఈ పక్షి కన్నులలో చూశావా, రమా, ఎంతటి విజయగర్వమున్నదో! ఆకాశపు టంచులకు ఎగిరి పోతున్నానని కాబోలు! లైఫ్ ఉన్నది రమా, ఈ చిత్రంలో!'

ఎవరో పొగడు తున్నారు.

ఎవరో కాదు. డాక్టరు మోహన్. తన జమీం దారు భార్యతో వచ్చినట్లున్నాడు ప్రదర్శనకి.

శశి స్తబ్ధురాలైంది.

శశి అంటే నేనేకదా? నా మనస్సు కలగుండు పడింది. ఆ చిత్రాన్నిగీసిన నా చేతిని ఎవరో విరుచు కొని తీసుకుపోతున్న ట్లనిపించింది.

పక్షి కన్నులలో వున్నది విజయగర్వమా ?

నేను చిత్రించిన పక్షి కన్నులలో జీవమున్నదా? నేను చిత్రించ దలచుకున్నది దీనత్వాన్ని, వేదనను, అంతులేని ఆవేదనను, ఆర్తిలేని నిరాశను.

పక్షి కన్నులలో విజయగర్వమున్న దంటా డేమిటి ? నా కళ పరాభూతమైనదా ?

లేక పక్షి కన్నులలో కనిపించే దీనత్వాన్ని చూడటానికి ప్రపంచం యిష్టపడటం లేదా ?

లేక నా ఆలోచనలోనే ఏమైనా లోపమున్నదా? నా జీవితంలో వేదనలేదేమో ? నేను నిర్వేదం చెంద వలసిన అవసరం లేదేమో ?

నా బాధను నేను ఐడలైజు చేసుకుంటున్నా నేమో ?

ఎంతోమంది పొగడ్తలకు ఎన్నో విధాలుగా ఆల వాలమైన నాకు జీవితంలో నిశ్వాసించవలసిన దేమీ లేదేమో ?

* * *

చిన్నతనంనుంచీకూడ ఎంతోమంది పొగడ్తలకు ఎన్నో విధాలుగా ఆలవాలమైంది, శశి జీవితం.

శశిచాల అందమైనది అనుకుంటుండేది అమ్మ.

వాళ్ళ శశి చాల తెలివైంది—అంటుండేవారు, ఊరివాళ్ళు.

ఎంతశ్రద్ధ లేకపోతే మా సూరమ్మ కూతురు అంత తెలిగ్గా మెడిసనులో సీటు సంపా దిస్తుందీ?—అన్నాడు, మామయ్య.

శశి అంటే నేనేకదా ?

నిజమే చాల శ్రద్ధగాచదివి, మెడిసనులో సీటు సంపాదించాను.

అమ్మా, మెడిసనులో సీటు వచ్చిందమ్మా—అంటూ తూనిగలా అమ్మదగ్గరకు ఎగిరివెళ్ళాను, పదేండ్లనాడు.

అమ్మ కనపరచిన ఆనందంలో ఏదో వెలితి—స్ఫురించిందే కాని మనసుకు పట్టలేదు.

'అదికాదే సూరమ్మా, ఆ నాలుగెకరాలకొండ అమ్మ కూతుర్ని చదువులకి పంపిస్తావే అనుకో. రేపిది డాక్టరైవస్తే దీనికి తగినవాడ్ని కట్నాలుపోసి తీసుకు రాగలవా? అసలే మగదిక్కులేని సంసారం'—అని సలహాచెప్పిన మామయ్యను పదేండ్లనాడు క్షమించలేదు, శశి.

'నిజమేననుకో అన్నయ్యా. కాని పిల్లది సంబరపడుతున్నది కదా ? తర్వాత దాని అదృష్టం ఎట్లాఉండో. ఎవరు చూడొచ్చారు?'—అని పదేండ్ల నాడు తన కోర్కెను మన్నించిన అమ్మను ఈనాడు క్షమించగల స్థితిలో ఉన్నదో లేదో ఆమెకే తెలియదు.

కాని అప్పట్లో అమ్మమాటలలో కనిపించిన ఆప్యాయత శశిని ఎంతగానో ఆనందపరిచింది.

రెక్కలు విప్పుకున్న పక్షికూనకు ఎదురు గుండా కనిపించేది, తాను జయించవలసిన విశాల

ఆకాశం.కమ్ముకునే మేఘాలు. సుళ్ళుతిప్పే గాలులు. దాని ఊహకు అందుతయ్యా ?

రెక్కలు విప్పనేర్చిన పక్షిలా సంబరపడింది, శశి. అంటే నేనేకదా ?

* * *

శశి ఈజ్ ఎ డీసెంట్ గర్ల్—అనేది వార్డెను.

శశి ఈజ్ క్లవర్ అండ్ డెలిజెంట్ — అనే వారు గురుదేవులు, గురుదేవతలు కూడ.

శశి ఈజ్ ఎ గుడ్ ఫ్రెండ్. కాదుటే లిమ్మీ!—అనేది కమల.

శశి ఈజ్ ఎ డేరింగు స్పిరిట్. కాదుటే కమలా !—అనేది విమల, ఉరఫ్ విమ్మీ.

శశి అంటే నేనేకదా ?

నేను మెడికలు కాలేజీలో చేరిన కొద్ది రోజుల్లోనే ఈ కాంప్లిమెంట్లన్నీ సంపాదించాను. ముఖ్యంగా డేరింగు స్పిరిటని !

సీనియర్సు కొత్తవాళ్ళను ఆటలు పట్టించే రోజులు. ఈ హాస్యాలు ఎంతో మొరటుగానూ, బాధావహంగానూ ఉండేవి. మగవిద్యార్థులు సరే. ఆడపిల్లలే ఆడపిల్లల్ని గేలిచేసేవారు.

ఈ విమల నన్నలాగే గేలిచేసింది.

యువర్ నేమ్ ప్లీజ్—అడిగింది విమల.

చెప్పాను.

'శశికళా! శశికళ చాల వోల్డు హీరోయిను. అందుకే నన్నుమాట ఆ జాకెటు నలా పరికిణీలో టక్ అప్ చేశావు? హి...హి...సో తుమ్‌హారా నామ్ హై మిస్ 1930—?'—అంటూ గేలిచేసింది విమల; హిందీ సినిమాల పిచ్చిది కాబోలు!

'థాంక్యూ గ్రానీ'—ఏమీ కలవరపడకుసమాండా ధానం చెప్పాను.

'వ్హాట్?'

'అదే, నామకరణం చేశారుగదా! మా గ్రానీ కూడ నా కిలాగే ముద్దుపేర్లుపెట్టి మురిసిపోతుండేది. ఆ బ్రా కంపెనీవాళ్ల పుణ్యమాఅనిగాని, లేకపోతే విూరన్నా మా గ్రానీలాగే ఉండేవాళ్లు'—మొరటు సమాధానమే. అయినా సాధ్యమైనంత సౌమ్యంగా చెప్పింది శశి.

విమల అప్పట్లో ముఖం మాడ్చుకున్నా, తర్వాత, తర్వాత మంచిస్నేహితురాలైంది శశికి.

అంటే నాకే గదా?

* * *

శశి ఈజ్ ఎ టెర్మగాంటు—అనేవాడో సోక్రటీసు. సూరేకాంతం అనుకో—అనేవాడో నూరుపైసల ఆంధ్రుడు. డోన్ట్‌టాక్ రట్. షి ఈజ్ ఎ ఫైన్ క్రీచర్—అనేవాడు మోహను.

మోహను శశికి సీనియరు.

శశిఅంటే నేనేకదా? నాకు మోహను రెండేళ్ళు సీనియరు.

విమల నా స్నేహితురాలైన రోజున ఆమెను చూచి నవ్వినగుంపులో అతనుకూడ ఉన్నాట్ట. అంతే కాదు. విమలచేత నేను తినిపించిన కారానికి అతని నోరుకూడ కాస్త చురుక్కుమనే అన్నదిట.

ఆ కారమే శశిని సూరేకాంతాన్ని, జినోఫియాను చేసింది, కో—మెడికోస్ దృష్టిలో

కాని ఆ కారమే మోహన్‌కి శశిని అపురూపిని చేసింది.

శశి నంటే నన్నేకదా?

నాకు మోహను క్రమక్రమంగా దగ్గరివాడయ్యాడు.

* * *

'నిర్మలత్వంలోనుంచి జనించిన నీ నిర్భయత్వం నన్నెంత ముగ్ధుణ్ణిచేసిందో గుర్తించలేవా, శశీ? నేను నిన్ను హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నాను' అన్నాడు మోహను.

చల్లటి సాయంత్రం. బీచి కళకళలాడుతున్నది—ఆనందపు హృదయాల సవ్వడులతో. అల్లంతదూరాన ఎగిరి, విరిగిపడుతున్న అలలమోత, పెళ్లి పందిట్లో విషాద సంగీతపు రికార్డు వేసినట్లున్నది. మోహను అన్నమాటలమాటుననుండి యిలాంటి ధ్వనులే ఏవో వినిపించినట్లయింది, శశికి.

శశికంటే నాకేకదా?

నన్ను మోహన్ హృదయ పూర్వకంగా ప్రేమిస్తున్నాడట. నాకూ మోహనంటే మురిపెం లేకపోలేదు. అతని సాన్నిహిత్యంలో నాలోని ఏవో జీవన స్రవంతులు చిరుగాలికి చల్లదనాన్ని అందించే సెలయేటి తరగలౌతూనే ఉండేవి.

కాని అతని ఆలోచన వేరు. అతను మా ప్రేమకు పెళ్లిలో పరిపూర్ణత్వం సిద్ధించాలని ఆశించాడు. పెళ్లిలో మాత్రమే అది లభించగలదని అతను విశ్వసించాడు.

నాకలాంటి ఆశలేదని కాదు. అప్పటికి నాలుగేండ్లనాడు మామయ్య సూచించిన సమస్యకు పరిష్కారమార్గం మోహన్‌లో నాకు గోచరించలేదని కాదు. కాని నేను మోహన్‌ని ప్రేమించింది కేవలం పెళ్లి సమస్యకు పరిష్కారంగా కాదు.

మోహన్ ఈజ్ ఎ లవబుల్ క్రీచర్; అందుకే మోహన్‌ని ప్రేమించింది—శశి.

అందుకే మోహను, శశి దంపతులుకా వీలులేని పరిస్థితులు ఏర్పడినప్పుడు మోహన్ బాధ పడ్డంతగా శశి బాధపడలేదు.

'జీవితంలో మనం ఆశించినవన్నీ జరగక పోవటం పెద్దషాక్ ఏమీ కాదనుకుంటాను. ఏమంటావు శశీ?' అని ప్రశ్నించాడు మోహన్, శశిని.

'అటు చూడు మోహన్. ఆ అలలు ఎలా ఎగిరి, విరిగి పడుతున్నయ్యో? అలా విరిగిపడుతూ కూడా అవి నిరాశ చెందటం లేదుకదా?' అన్నది శశి.

అందమైన మాటలలో ఒదిగిపోయే భావాలను కొంతమంది తమ స్వంతం చేసుకుంటూ ఉంటారట, ఆ మాటల అందానికి మురిసిపోయి. శశిలో అలాంటి లోలుపత్వం లేదు. తనకేమీ షాక్‌లేదని ఆమె చెప్పిందీఅంటే కారణం ఆమె నిజంగా షాక్ తినకపోవటమే.

జీవితంలో ఆశించినవన్నీ లభించనంతమాత్రాన షాక్ తినేటంతటి దుర్బలురాలుకాదు శశి.

'మా నాన్న దృష్టంతా కోడలుతెచ్చే కట్నం మీదనే ఉన్నది శశీ'—అని బావురుమన్న మోహన్‌ని ఆమే ఓదార్చింది.

ప్రేమ పెళ్లిగా పరిణామం చెందనంతమాత్రాన తన ప్రేమ వ్యర్థమైనట్లు, జీవితం సర్వనాశనమైనట్లు భావించే సెంటిమెంటల్ క్రీచరుకాదు, శశి. సోక్రటీసు చెప్పినట్లు ప్రేమ ఒక సుందరమైన భావం. భగవంతునిలో తాదాత్మ్యం పొందాలనే మానవుని ఆవేదన కది రూపం. మోహన్ లవబుల్ క్రీచరు!

అందుకే ఎక్కువబాధ పడకుండానే మోహన్ నుంచి మంచిస్నేహితురాలుగా యివతలకు వచ్చేసింది శశి.

అదీగాక మామయ్య సూచించిన సమస్యను మరో రెండు, మూడేళ్లు వాయిదా వేయవచ్చునుకదా?

వాయిదా వేసేసింది, శశి. అంటే నేనేకదా?

*　　*　　*

ఆ సమస్యనలా వాయిదావేసి యిప్పటికప్పుడే ఆరేళ్లు గడిచిపోయినై.

ఆరు వసంతాలు దొర్లిపోయినై—అనిఉండేవాళ్లం, యిదే గనుక రొమాంటిక్ హీరోయిన్ల జీవితమైతే.

మరి శశి జీవితంలో?

ఆరు శిశిరాలు గడిచినై అనాలా? ఆరు యుగాలు గడిచినై అనాలా?

శశిఅంటే నేనేకదా!

ఏమైనది నా ఆరేళ్ల జీవితం?

మామయ్య సమస్య అపరిష్కృతంగానే ఉండిపోయిందికదా? అపరిష్కృతంగా నన్ను వేధిస్తున్నదా? ఏమో నాకే తెలియదు.

ఆనాడు మామయ్య మాటప్రకారం ఆ నాలుగెకరాల కొండ్రతో ఒక ఇంటివాన్నయితే బాగుండేదేమో?

కాని మానవురాలుగా జన్మించినందుకు, మనిషి పొందవలసిన విజ్ఞానం అందుబాటులోకివస్తే, దాన్ని కాదని,మొగుడ్ని వెతుక్కుంటూ పోవటమా?

ఈ ఆరేళ్లలో అనేక చిన్న, పెద్ద పాత్రలు తారసపడినై, శశి జీవితంలో.

డాక్టరు ఆనంద్!

శశి హౌస్‌సర్జన్ చేస్తున్న రోజుల్లో హాస్పిటల్లో పనిచేస్తుండేవాడు. మెడికోస్‌తో సరదాగా కబుర్లు చెప్తుండేవాడు. శశిని అదేదో కొత్త ఆదరంతో పలుకరించేవాడు.

శశికి అతనూ నచ్చలేదు; అతని ధోరణీ నచ్చలేదు.

'ఆదర్శాలు వల్లెవేయటంకాదు డాక్టర్. ఆచరణ కావాలి'—అన్నది శశి డాక్టరు ఆనందంతో; వరకట్నాలను గురించి లెక్చరిస్తున్న ఆనందంతో.

'ష్యూర్, ష్యూర్. నేను ఆచరణకీ సిద్ధమే. నాకు నచ్చిన స్త్రీ నన్ను చేసుకోవటానికి యిష్టపడితే నేను సిద్ధమే'

'ఏమిటి డాక్టర్, ఛాలెంజీ చేస్తున్నారు. మిమ్మల్ని పరీక్షించటానికి ఇప్పుడు ఎవరన్నా మిమ్మల్ని పెళ్లి చేసుకోవాలన్నమాట'—అని నవ్వేశారు మెడికోస్.

అతని రూపము ఏ మాత్రమూ నచ్చని శశికి అతనిలో తన సమస్యకు పరిష్కారమున్నట్లు కనిపించలేదు. డాక్టర్ ఆనంద్! ఎక్కడున్నాడో యిప్పుడు? ఏదో స్పెషలైజేషనుకని అమెరికా వెళ్లాడు. అక్కడే స్థిరపడి పోయాడేమో?

పాత కుర్చీకి బిగించిన తుప్పుపట్టిన మేకులా తన జీవితమూ స్థిరత్వాన్ని పొందినట్లేననిపించింది శశికి.

ఏమిటీ జీవితమిలా తెల్లవారి పోవలసినదేనా?

పెళ్ళి శారీరక అవసరముమాత్రమే అయితే శశికి అదొక సమస్యకాదు. కాని శశి భావన వేరు.

మానవుడు పురోగామి కావటంలో వివాహమొక ముఖ్యమైన అడుగు. జీవిత పరిపూర్ణతను సాధించుకునే మార్గంలో అదొక చక్కటి మజిలీ.

మాతృత్వం అనుభవించవలసిన ఆనందం.

కాని ఏమిటీ సమాజపు స్థితి? ఏమిటీ నికృష్టపు స్థితి? జీవిత భాగస్వామిని డబ్బుపెట్టి కొనుక్కోవలసిన ఈ దుర్గతిని ఏమనాలి?

చదువు సంధ్యలుండి, అందచందాలుండి పెళ్లి చేసుకునే తాహతులేని తన జీవితాన్ని ఏమనాలి? తనకే భర్త కొనరాని వస్తువైపోతే, మిగతా ఆడపిల్లల మాటేమిటి?

కట్నాలపిశాచిబారినపడి వికారంగా మారిపోతున్న మానవహృదయ సౌందర్యాన్ని చూచి ఎంతని విలపించగలం?

తన ముందున్నవి రెండే మార్గాలు. తాను అవివాహితగా మిగిలిపోవటం. లేదా తనకంటె తక్కువవాణ్ణో, తన మనసుకు నచ్చనివాణ్ణో ఎవరినో ఒకరిని ముడిపెట్టేసుకోవటం.

ఎంతమంది పొగడ్తలనో ఎన్నోవిధాలుగా పొందిన తన జీవితంలో ఏమిటీ వెలితి?

సముద్ర, ఆకాశాలమధ్య ఎగురుతూ ఎన్నాళ్లీ జీవితాన్ని గడపటం?

తన జీవితంలో నిర్వేదం లేకపోవటమేమిటి? పక్షి కన్నులలో విజయగర్వ మెక్కడిది?

కాని పక్షి కన్నులలో విజయగర్వమున్నదంటాడేమిటీ డాక్టరు?

తెలుపుని భావస్ఫోరకంగా వాడానంటుందేమిటీ విమల?

తన వేదన ప్రపంచానికి అర్థంకాదా?

తన జీవితంలోని వెలితిని ప్రపంచం గుర్తించలేదా?

కలలోవేసిన కేకలా తన వేదన ఎవరికీ విన్పించదా?

తన కీ లోకంనుంచి ఏమీ సానుభూతి లభించదా?

చెదరిన తేనెపట్టయింది, శశి మనస్సు.

శశి అంటే నేనేకదా?

* * *

మరొక ఏడాది కలిసిపోతున్నది, కాలగర్భంలో. పాత పాత్రలు పునః ప్రవేశంచేసినై, శశి జీవితంలోకి. డాక్టరు ఆనంద్ తన నగరానికే వచ్చాడు, ఆర్. యమ్. వో. గా.

కొత్తఆదరంతో పలుకరించాడు శశిని.

ది ఛాలెంజ్ ఈజ్ స్టిల్ దేర్—అన్నాడు నవ్వుతూ.

ఆక్సెప్ట్ చేస్తే అతని ఛాలెంజీని?

వివాహమాడితే ఆనంద్ ని?

తానిలా ఎల్లకాలమూ రెండు మహాశూన్యాల మధ్య ఎగురుతూ ఉండలేదు. అందిన ఆధారాన్ని చేరుకొని సేద తీరటమే మంచిది.

ఆ ఆధారం ఆనందే ఎందుకు కాకూడదు?

* * *

డాక్టరు శశికళగారు గీసిన చిత్రమా యిది. ఎలా నమ్మటం?—అంటున్నారు ప్రేక్షకులు.

డాక్టరు శశిగీసిందా ఈ చిత్రాన్ని. ప్చ్—అంటున్నారు తోటి డాక్టర్లు.

అదికాదే విమ్మీ, ఆ ఓడేమిటి? అంత అందవికారంగా ఉన్నదికదా? దానిమీద ఆ అందాలపక్షి కూర్చోవట మేమిటి చెప్పు—అంటున్నది కమల, కళ్ళనీళ్ళపర్యంతమై.

ఇంకా అంతకంటె ఆ అందాలపక్షి అలలపైపడి కొట్టుకుపోయినట్లు చిత్రించినా గ్రాండుగా ఉండేది. మన శశి భావనలో ఏమిటీ ఈ సౌందర్య రాహిత్యం?—అంటూ బావురుమన్నది విమల.

ఏమిటీ సౌందర్య రాహిత్యమే? శశిభావనలోనే వికారమా?

మరుసటి సంవత్సరం ప్రదర్శనానికి కో చిత్రాన్ని గీసిచ్చింది, శశి.

శశి అంటే నేనేకదా? నిరుటి చిత్రాన్నే మరొక విధంగా చిత్రించి యిచ్చాను.

ఎక్కడినుంచి వచ్చిందో ఒక పాతకాలపు ఓడ. దాని తెరచాపమాటున సేద తీర్చుకుంటున్నది అందాలపక్షి.

నల్లటి మేఘాలు బెదిరిస్తున్నయి ఆకాశంలో. తెల్లటి నురగలు కక్కుతున్నాయి సముద్రంలోని అలలు.

కాని పక్షి కళ్లలో బెదురులేదు. తనకు తెరచాప నీడ లభించింది కదా?

కాని ఏమి టీ వ్యాఖ్యలు?

పక్షి ఆధారం చూసుకోవటం సౌందర్య రాహిత్యమా?

అలలపైపడి చనిపోవటం గ్రాండుగా ఉంటుందా?

ఈ జీవితపు సుడి గుండాలలో పడి రాలిపోతే తప్ప తనకీ లోకపు సానుభూతి లభించదా?

ఏమిటీలోకం? ఏం చేయాలి తాను?

దొరికిన తెరచాప మాటున కూర్చొని గుమికూడి వస్తున్న మేఘాలనుంచి తప్పించుకోవాలా?

లేక రెక్కలలో బలమున్నంతవరకు ఎగురుతూనే ఉండి, బలముడిగిననాడు అలలపైపడి నశించిపోవాలా?

అలా పడిపోయిననాడు 'గ్రాండ్'అని మెచ్చుకుంటుందా ఈ లోకం!

ఎంత నిర్దయురా లీ ప్రపంచం?

తెరచాపమాటున సేద తీర్చుకుంటున్న పక్షి మెడను విరిచేయాలని ముందుకొస్తున్నాడో, ఓడ కళాసి. అతన్ని ఉత్సాహపరుస్తున్నారు మిగిలిన ఓడ కళాసీలు.

చిత్రాన్నిలా మారిస్తే?

లేక విమల సూచించిన మార్పునే అంగీకరిస్తే?

లేక చిత్రంలో ఏ మార్పునూ అంగీకరించనని మొండిగా, బండగా తన దోవన తాను పోతే?

బండగానా?

ఓ గాడ్! ఏంచేయా లీ అసంపూర్ణ చిత్రాన్ని?